క్లుప్తంగా

ఎస్పీకి సన్మానం



రోహిత్‌రాజ్‌కు బొకే అందజేస్తున్న సుబ్బారెడ్డి

కొత్తగూడెంటౌన్‌: ఎస్పీ రోహిత్‌రాజ్‌ను మంగళవారం కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన కాంట్రాక్టర్‌ ఎస్వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు పలువురు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి, సన్మానించారు. డాక్టర్‌ ఏ.ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్‌ నవీన్‌రెడ్డి, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సంఘీభావం

కొత్తగూడెంరూరల్‌: జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్‌ నుంచి గణేష్‌ టెంపుల్‌ మీదుగా బస్టాండ్‌, అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రాహుల్‌ గాంధీ చేపట్టిన జోడో న్యాయ యాత్రకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు.

అభినందనలు

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణ విభాగంలో ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్‌ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చిన్నారి మూడ్‌ విశ్వామిత్ర చౌహాన్‌, మొక్కల రాజశేఖర్‌ను పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు మంగళవారం ఖమ్మంలోని తమ ఇంటికి ఆహ్వానించి సన్మానించారు. మొక్కల నాటే ఉద్యమాన్ని మరింతగా చేపట్టాలని సూచించారు.

కలెక్టర్‌, ఎస్పీలను కలిసిన డీసీఎంఎస్‌ చైర్మన్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): డీసీఎంఎస్‌ నూతన చైర్మన్‌ కొత్వాల శ్రీనివాసరావు మంగళవారం కలెక్టర్‌ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు. యర్రంశెట్టి ముత్తయ్య, పులి సత్యనారాయణ, దారా చిరంజీవి, బరపటి ప్రసాద్‌, బరపటి శ్రీను ఉన్నారు.

బెల్లం అమ్మితే చర్యలు

టేకులపల్లి: మండలంలో కిరాణా షాపుల్లో బెల్లం, పటిక విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్‌ ఎస్‌ఐ పి.రమాదేవి వ్యాపారులను హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని షాపుల్లో సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు.

కార్మికుడికి గాయాలు

పాల్వంచ: కేటీపీఎస్‌లో కాంట్రాక్ట్‌ కార్మికుడు జారి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు... మంగళవారం పనికి కె.ప్రసాద్‌ కోల్‌ షెడ్డుపై షీట్స్‌ మారుస్తుండగా జారి పడ్డాడు. కాలు విరిగి, పలుచోట్ల గాయాలయ్యాయి. కొత్తగూడెంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కళ్లకు గంతలతో నిరసన

ఇల్లెందు: పీడీఎస్‌యూ జిల్లా జనరల్‌ కౌన్సిల్‌ సమావేశం భద్రాచలంలో నిర్వహిస్తుండగా అక్కడి పోలీసులు అడ్డుకోవడం తగదని విద్యార్థి సంఘాల నాయకులు వాపోయారు. ఈ మేరకు విద్యార్థి సంఘాలతో కలిసి మంగళవారం ఇల్లెందులో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని అంబేద్కర్‌ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గణేష్‌, బయ్యా అభిమన్యు, సాయి, పార్థు, సిద్ధు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు..

టేకులపల్లి: ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ (ఎల్టా) ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లి మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎల్టా మండల కన్వీనర్‌ మురళీధర్‌, కోకన్వీనర్‌ ప్రశాంతి అధ్యక్షతన విద్యార్థులకు స్పెల్‌ విజర్డ్‌, డ్రామా పోటీలు నిర్వహించారు. టేకులపల్లి హైస్కూల్‌ విద్యార్థి ఎం.నిరాజ్‌ ప్రథమ, బొమ్మనపల్లి హైస్కూల్‌ విద్యార్థి బి.రోహిత్‌ ద్వితీయ స్థానం సాధించారు. ఫిబ్రవరి 13న జిల్లా స్థాయి పోటీలుంటాయని తెలిపారు.

సెలూన్‌ షాపుల కమిటీ ఎన్నిక

టేకులపల్లి: ఎస్టీ బంజారా హెయిర్‌ కటింగ్‌ షాపుల టేకులపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం బంజారా హెయిర్‌ కటింగ్‌ షాపు నిర్వాహకులు, వర్కర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో షాపుల నిర్వహణ, ధరలు, సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా నూనావత్‌ హరిలాల్‌, ప్రధాన కార్యదర్శిగా పాల్తియా ప్రసాద్‌, ఉపాధ్యక్షుడిగా తేజావత్‌ మంగీలాల్‌, కార్యదర్శిగా లాకావత్‌ సురేష్‌, కోశాధికారిగా భూక్యా కైలాష్‌, సలహాదారుడిగా తేజావత్‌ బిక్కు, కమిటీ సభ్యులుగా లచ్చిరాం, శేఖర్‌, గణేష్‌, హుస్సేన్‌, వీరన్న, నరేష్‌లను ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీలను గుర్తించాలి

పాల్వంచ: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్‌ అన్నారు. మంగళవారం యూనియన్‌ కార్యాలయంలో పలువురు ఏఐటీయూసీలో చేరారు. వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రసాద్‌ మాట్లాడారు. వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శ్రీను, పాషా, దేవి, ఉమ, సుచిత్ర, ప్రసన్న, పద్మ పాల్గొన్నారు.

‘ఆమె’ పాలన.. ప్రగతికి బాట

- పల్లెలను ప్రగతి పథం వైపు నడిపించిన మహిళా సర్పంచ్‌లు
- పరిపాలనలో ప్రత్యేక గుర్తింపు



సుజాతనగర్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన సెంట్రల్‌ లైటింగ్‌

సుజాతనగర్‌: ఇంట్లో ఉన్నప్పుడు ఇంటి పనులు, భర్త, పిల్లలు అంటూ వారి బాగోగులపై దృష్టి పెట్టిన మహిళా సర్పంచులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు. ఒకవైపు కుటుంబ బాధ్యత, మరోవైపు ప్రజాసేవ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ పాలనలో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఐదేళ్లలో గ్రామాలను అభివృద్ధి చేసి మహిళా శక్తిని చూపించారు. రేపటితో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. మహిళా సర్పంచ్‌ల మనసులో మాట..

ప్రజాప్రతినిధిగా అందుబాటులో..



మండలంలోనే అతిపెద్ద పంచాయతీ అయిన సుజాతనగర్‌ సర్పంచ్‌గా ప్రజలకు ఐదేళ్ల పాటు అందుబాటులో ఉన్నాను. ప్రజల కష్టసుఖాలను తెలుసుకునే అవకాశం కలిగింది. సర్పంచ్‌గా శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, సెంట్రల్‌ లైటింగ్‌, క్రీడాప్రాంగణం, నర్సరీ, సీసీ రోడ్లు, రైతువేదిక వంటి నిర్మాణాలు పూర్తి చేశాను. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేశాను. మండల కేంద్రంలో సులభ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణం కోసం ప్రయత్నించినా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అది పూర్తి కాలేదు.

– సీకా కృష్ణవేణి, సర్పంచ్‌, సుజాతనగర్‌

అందరి సహకారంతో అభివృద్ధి..



సింగభూపాలెం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవ చేసే అవకాశం వచ్చింది. నాన్న, ప్రజాప్రతినిధులు, గ్రామప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయగలిగాను. ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించాను. గ్రామాన్ని అన్ని విధాలుగా వివక్ష లేకుండా, ఎటువంటి రాజకీయ వత్తిడులు లేకుండా అభివృద్ధి చేసేందుకు నా శక్తి మేరకు కృషి చేశాను. మా గ్రామ ప్రజలు నన్ను ఎంతో ప్రోత్సహించారు. అందరికీ ధన్యవాదాలు.

– బూరుగు హేమకృష్ణ చైతన్య, సర్పంచ్‌, సింగభూపాలెం

మొదటి సర్పంచ్‌గా గుర్తింపు..



సుజాతనగర్‌ గ్రామపంచాయతీ నుంచి కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీ నాయకులగూడెం. మా గ్రామానికి మొదటి సర్పంచ్‌గా ఎన్నిక కావడం జీవితాంతం గుర్తుండిపోయే విషయం. కొత్త గ్రామపంచాయతీ అన్నింట్లో ముందుండాలనే తపనతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశాం. రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించి తన ఆధ్వర్యంలోనే ప్రారంభించాం. వైకుంఠధామం, కంపోస్ట్‌ షెడ్‌, సీసీ రోడ్లు, పల్లె ప్రగతివనం తదితర పనులు పూర్తిచేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– మండే నాగరాజేశ్వరీ, సర్పంచ్‌, నాయకులగూడెం

అభివృద్ధికి ప్రాధాన్యం..



2019లో కొత్తగా ఏర్పాటైన బేతంపూడి గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. చాలా సంతోషంగా ఉంది. గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాను. అంతర్గత సీసీ రోడ్లు, మిషన్‌ భగీరథ వాటర్‌ ట్యాంకులు, నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్‌ షెడ్‌ తదితర పనులు చేయడం సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో మా గ్రామం మరింత అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాను. **–బానోత్‌ లలిత, సర్పంచ్‌, బేతంపూడి**

ఊరు మారిపోయింది..



ఐదేళ్లలో తాను సర్పంచ్‌గా చేసిన పలు అభివృద్ధి పనులతో మా ఊరు ఎంతో మారిపోయింది. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. గత ఐదేళ్లలో చిన్న గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయగలిగాను. అంతకుముందు వీధిలైట్లు సాధారణమైనవి ఉంటే వాటి స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు పెట్టాం. హరితహారంలో భాగంగా వీధుల పక్కన మొక్కలు నాటించాము. మా గ్రామస్తులు, అధికారులు సహకరించారు. వారందరికీ ధన్యవాదాలు. – సుజాత, సర్పంచ్‌, మంగపేట

అభివృద్ధే ధ్యేయంగా...



2019లో సర్పంచ్‌గా ఎన్నికై బాధ్యతలు తీసుకున్నాను. ఐదేళ్లలో గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు చాలా సంతోషాన్ని కలిగిస్తున్నాయి. మా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు ఎంతో సహకరించారు. శ్మశానవాటిక, డంపింగ్‌ యార్డులు నిర్మించుకున్నాం. గ్రామంలో కొంతమంది పేదలకు డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు కూడా మంజూరయ్యాయి. ఇది మరువలేనిది. నా జీవితానికి ఇది చాలు.

– తుర్సం సీత, సర్పంచ్‌ గరీబ్‌పేట

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్‌

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని మల్టీ డిపార్ట్‌మెంటల్‌ టీమ్స్‌ కార్యక్రమాన్ని జీఎం జాన్‌ ఆనంద్‌ నిర్వహించారు. మంగళవారం ఇల్లెందు ఏరియాలోని ఎంవీటీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, సింగరేణిలో వాడుకలో ఉన్న మిషనరీ పని తీరు, ఉత్పత్తి వ్యయాన్ని వివరించారు. కంపెనీ భవిష్యత్‌, ప్రణాళికలు, కార్మికులకు సంస్థ అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించటానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించటం జరుగుతుందని తెలిపారు. ఎస్‌ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షులు శివప్రసాద్‌, అధికారుల గిరిధర్‌రావు, బొల్లం వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్‌, జీవీ మోహన్‌రావు, మధుబాబు, మహేష్‌, నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం బ్రాంచీ సెక్రెటరీ నజీర్‌ అహ్మద్‌ పాల్గొన్నారు.

విద్యుత్‌ భద్రతపై అవగాహన

సింగరేణి ఇల్లెందు ఏరియాలో అధికారులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లకు, ట్రేడ్‌ పర్సన్లకు ఆఫీసర్స్‌ క్లబ్‌లో విద్యుత్‌ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎం జాన్‌ఆనంద్‌, డీఎంఎస్‌ (ఎలక్ట్రికల్‌) ఎస్సీజడ్‌ హైదరాబాద్‌ ఎస్‌.ఆనందవెల్‌ అవగాహన కల్పించారు. విద్యుత్‌ పరికరాల మీద పని చేస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పవర్‌పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా వివరించారు.

కేంద్ర ప్రభుత్వ ‘సంక్షేమం’పై ప్రచారం



మాట్లాడుతున్న రమేష్‌

జూలూరుపాడు: కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్‌ తెలిపారు. మంగళవారం జూలూరుపాడులో జరిగిన బీజేపీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు బీజేపీ ఆధ్వర్యంలో గావ్‌ చలో కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒక్కో గ్రామంలో ఒక నాయకుడు పర్యటించి, ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, స్థానిక సమస్యలు తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌ ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతులకు ఒకేసారి రూ.రెండు లక్షల రుణాన్ని మాఫీ చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నున్నా రమేష్‌, మాదినేని సతీష్‌, భూక్యా శ్రీను, సిరిపురపు ప్రసాద్‌, భూక్యా రాజేష్‌, పుల్లారావు, గోపాల్‌రావు, నర్వనేని కృష్ణ పాల్గొన్నారు.

యజమానుల తీరుతో అధికారులకు తంటాలు



నిర్మాణ పనులను అడ్డుకుంటున్న అధికారులు

చుంచుపల్లి: విద్యానగర్‌ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న కొందరు యజమానులతో అధికారులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు 15 రోజులుగా అధికారులు అనుమతులు లేని నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తున్నారు. విద్యానగర్‌ ఏరియాలో దాదాపు పది అనుమతులు లేని బహుళ అంతస్తుల నిర్మాణాలను గుర్తించిన అధికారులు నోటీసులు జారీ చేయడమే కాకుండా పనులను సైతం అడ్డుకున్నారు. అయితే వీటి విషయంలో యజమానులు అధికారులతో నిత్యం ఆటాడుకుంటున్నారు. అధికారులు వచ్చి పోగానే పనులు ఆపినట్టే ఆపి మళ్లీ గంటల వ్యవధిలో మామూలుగానే పనులు కొనసాగిస్తున్నారు. వెంటనే సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి చేరుకోవటం మళ్లీ పనులు ఆపడం పరిపాటిగా మారుతోంది. యజమానుల తీరుతో తమ విధులకు నిత్యం ఆటంకం కలుగుతోందని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. ఎంత చెప్పినా యజమానుల తీరులో మార్పు రావడం లేదని రెండు రోజుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బంది తెలిపారు. కొందరు యజమానులైతే పగటిపూట అధికారుల పర్యవేక్షణ ఉంటుందని గ్రహించి రాత్రి సమయాల్లో నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. దీనిపై ప్రతీరోజు ఎవరో ఒకరు కలెక్టరు, డీపీఓలకు ఫిర్యాదులు చేస్తుండడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగాల్సి వస్తోంది. ఇదే కోవలో మంగళవారం సైతం పరిసర ప్రాంతాల వారు కొందరు నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ గ్రామపంచాయతీ సిబ్బందితో వెళ్లి అనుమతులు లేని భవన నిర్మాణాల పనులను అడ్డుకొని నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబూరావు, సిబ్బంది కిషోర్‌, రామకృష్ణ, అమర్‌ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్‌ ఉద్యోగులకు సన్మానం



మురళిని సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): వివిధ విభాగాలలో పని చేసి ఉద్యోగ విరమణ పొందనున్న వారిని మంగళవారం సింగరేణి కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్‌ హాల్‌లో సెక్రటేరియల్‌ స్టాఫ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో అజీత్‌ (పర్చేజ్‌ విభాగం), రాబిన్‌సన్‌ (మెయిన్‌ ఆస్పత్రి), లక్ష్మీనారాయణ (కంపెనీ సెక్రటరీ ఆఫీస్‌), రమేష్‌ (పర్సనల్‌ డిపార్ట్‌మెంట్‌), మురళి (సర్వే డిపార్ట్‌ మెంట్‌), రాజేశ్వరరావు (బీడీ) ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాంసింగ్‌, శ్రీనివాస్‌, కృష్ణారెడ్డి, రాజేశ్వరరావు, జయరాజ్‌, వెంకటేశ్వర్లు, గణేష్‌, రాయలింగు, అశోక్‌, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకం

ఇల్లెందు: శ్రీ హరిహర క్షేత్రం ధర్మకర్తల మండలి నియామకం కోసం నోటిఫికేషన్‌ జారీ అయింది. మంగళవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.సూర్యప్రకాష్‌ మాట్లాడుతూ.. 20 రోజుల్లో ఆసక్తి కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టెండర్లు నిర్వహించండి..

ఇల్లెందు: తెలంగాణ ప్రభుత్వం 2024 సీజన్‌లో తునికాకు సేకరణకు టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లను ఆహ్వానించాలని, 50 ఆకుల కట్ట ధర నిర్ణయించాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

దుప్పట్ల పంపిణీ

కొత్తగూడెంఅర్బన్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం రాత్రి కొత్తగూడెం ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ సర్కిల్‌లో యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌ బాణాల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కొత్తగూడెం అధ్యక్షుడు షేక్‌ దస్తగిరి, కార్యదర్శి, లగడపాటి రమేష్‌ చంద్‌, చెరుకు శ్రీను, మొరిశెట్టి మోహన్‌రావు, జవహర్‌రెడ్డి మన్నెం, కోయ్యాడ నగేష్‌, కోటేశ్వరరావు, బిక్కులాల్‌, చంద్రరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలివ్వాలి

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): చుంచుపల్లి మండలంలోని సర్వే నంబరు 137/1 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్‌ కోరారు. మంగళవారం కొత్తగూడెం ఆర్‌డీఓ, చుంచుపల్లి తహసీల్దార్లకు ఈ మేరకు వినతిపత్రాలను అందజేశారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తత అవసరం

ఇల్లెందు: ప్రభుత్వం కుష్ఠు వ్యాధి నివారణ చర్యలు ముమ్మరం చేసిందని, అలాంటి జబ్బు ఉన్నట్లు గుర్తిస్తే ప్రాథమిక దశలో వైద్యం పొందాలని డాక్టర్‌ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్టేషన్‌ బస్తీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తి శరీరంపై స్పర్శ లేని గోధుమ, రాగి మచ్చలు, ఎరుపు మచ్చలు ఉన్నట్లయితే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్‌ మానస, డీపీఎంఓ గన్యా, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ విజయ్‌కుమార్‌, పూజారీ హరిగోపాలశర్మ పాల్గొన్నారు.

పాల్వంచ: కుష్టి వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలని జగన్నాథపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు అన్నారు. మంగళవారం జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. వైద్యులు కృష్ణ ప్రసాద్‌ సూపర్‌వైజర్‌ ఇంద్రావతి, ఏఎన్‌ఎం వసంత, హెల్త్‌ అసిస్టెంట్‌ శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుజాతనగర్‌: కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు డాక్టర్‌ రమేష్‌ అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధి లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సూచించారు.

పర్యావరణంపై అవగాహన పెంచాలి

కొత్తగూడెంఅర్బన్‌: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం చాతకొండ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మాదిరి జిల్లా పరిషత్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమ్మక్క–సారక్క జాతర– పర్యావరణ పరిరక్షణపై చర్చించిరు. సమావేశంలో జిల్లా సైన్స్‌ ఆఫీసర్‌ ఎస్‌.చలపతిరాజు మాట్లాడుతూ... పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించినప్పుడే వారి తల్లిదండ్రుల్లో, గ్రామంలోని ప్రజలకు వివరించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు నాలుగు బృందాలుగా ఏర్పాడి అధికార, ప్రతిపక్షం, అధికారులు, పత్రికా విలేకరులుగా చర్చించారు. చర్చలో జిల్లా పరిషత్‌ సీఈఓ కీర్తన, జిల్లా పరిషత్‌ చైర్మన్‌గా పవిత్ర చర్చలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు అమీరుద్దీన్‌, సురేష్‌, నాగలక్ష్మి, వాణీ జగన్‌మోహన్‌, పద్మ పాల్గొన్నారు.

‘ఉపాధి’కి నిధులు పెంచండి

ఇల్లెందురూరల్‌: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్‌ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కూలీలు ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ బాలరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌ మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనిదినాలు తగ్గిస్తూ నిధుల కేటాయింపులో సైతం కోత విధిస్తున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచి పనిదినాలు కూడా పెంచాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నబీ, ఎస్తేరు, వసంత, ఉషారాణి, జ్యోతి, చింత అనసూయ, ఈసం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై విచారణ

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొత్తతండా(జి) గ్రామానికి చెందిన పురాతన చెరువు శిఖాన్ని ఆక్రమించుకున్నారని గ్రామస్తులు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారి మంగళవారం విచారణ నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం కొత్తతండా(జి) గ్రామంలో సుమారు 60 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఆధ్వర్యంలో ముండికుంట పేరుతో చెరువును తవ్వించారు. ఆనాటి నుంచి నిరుపేద రైతులకు ఈ చెరువు ద్వారా ఖరీఫ్‌, రబీ సీజన్లలో రెండు పంటలకు సాగు నీరు అందుతోంది. ఐదు సంవత్సరాల క్రితం బిల్లుడు తండాకు చెందిన రైతు అజ్మీర మోతీలాల్‌ సుమారు 4 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించుకున్నాడు. పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, సమగ్ర విచారణ జరిపించి చెరువు స్థలాన్ని కాపాడాలని కోరుతూ ఈ నెల 9న గ్రామానికి చెందిన ఎంపీటీసీ వి.ధనలక్ష్మి, తండా నాయక్‌ శంకర్‌, బి.నరేష్‌, బి.రవి, టి.ప్రేమ్‌కుమార్‌, బి.నాగేశ్వర్‌రావు, మంగి, శ్రీను, రమేష్‌ తదితరులు టేకులపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆర్‌ఐ వెంకటేశ్వర్లు చెరువు వద్దకు వచ్చి విచారణ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి చెరువు పూర్తి వివరాలు సేకరించారు.

మౌలిక వసతులు కల్పించాలి



ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

ఇల్లెందురూరల్‌: మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్‌ తండా వద్ద పేదలు ఏర్పాటు చేసుకున్న కాలనీకి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ బాలరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్‌ నబీ మాట్లాడుతూ.. 2011లో అప్పటి తహసీల్దార్‌ సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్‌తండా వద్ద 120 మంది పేదలకు ఇంటి పాట్ల పట్టాలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. నాటి నుంచి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా పాలకులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి రహదారులు, ఇంటి నంబర్లు, వీధి దీపాలు, తాగునీరు సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అలేటి కిరణ్‌, మోహన్‌రావు, ఖాదర్‌, యాకూబ్‌, వైకుంఠం, రసూల్‌, కోటమ్మ, సుజాత, రాణి తదతరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

కొత్తగూడెంఅర్బన్‌: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్‌ రెహమాన్‌ అన్నారు. మంగళవారం రైల్వే స్టేషన్‌ ఆవరణలో రోడ్డు భద్రత వారోత్సవాల నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు అవగహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆటోలు కండీషన్‌లో ఉండాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, లైట్లు సరిగ్గా ఉండడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్‌ సీఐ మురళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ సిద్ధాంతాలు మార్గదర్శకం



పాల్వంచ: ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు పంపిణీ

అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రాన్ని అందించిన జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ... గాంధీ సిద్ధాంతాలు అందరికీ మార్గదర్శకం అని, ఆయన ఆశయ సాధనకై కృషి చేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్‌



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్‌ సభ్యులు



టేకులపల్లి ఎంపీడీవో కార్యాలయంలో..



కొత్తగూడెంరూరల్‌: నివాళులర్పిస్తున్న నాగా సీతారాములు



జూలూరుపాడు: ఆర్యవైశ్య సంఘం నాయకులు